


చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4. సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 4.56



న్యూస్‌రీల్

వలంటీర్లంటే చంద్రబాబుకు వణుకు

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్న వలంటీర్లను చూస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబుకు వణుకు పుడుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మంచి చేసే వారు చంద్ర బాబుకు ఏమాత్రం నచ్చరని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టినప్పటి నుంచీ వారిని చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారన్నారు. మగవాళ్లు లేని సమయంలో వలంటీర్లు ఇంటి తలుపు తడుతున్నారంటూ గతంలో కూడా విష ప్రచారం చేశారన్నారు. నేడు తన శిష్యులతో కలిసి కుట్రపన్ని వలంటీర్ల సేవలు అడ్డుకున్నారని మండిపడ్డారు. తన కుయుక్తులతో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు కష్టాలు తెచ్చిపెట్టారన్నారు. పింఛన్‌దారులకు బేషరతుగా చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే కోర్టులో వేసిన పిటీషన్ వెనక్కు తీసుకోవాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అవినీతికి తావు లేకుండా పాలన సాగించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జూలై నుంచి మళ్లీ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ అందించేలా చర్యలు తీసుకుంటామని, పింఛన్ దారులు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా కేతన్‌గార్గ్

- కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్ బదిలీ



కలెక్టర్ ఎం.గౌతమి — ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ — ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎన్నికల అధికారిగా జేసీ కేతన్‌గార్గ్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ గౌతమిని బదిలీ చేస్తూ భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆయన ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టారు.

ఎస్పీ అన్బురాజన్ బదిలీ..

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను కూడా ఈసీఐ బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారుల బాధ్యతలను వారి కిందిస్థాయి అధికారికి తక్షణం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సూచించింది. బదిలీ అధికారులకు ఎన్నికల విధులు అప్పగించరాదని ఆదేశించింది.

7 వరకూ ఏపీ ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం: ఏపీ ఐసెట్–2024 దరఖాస్తులను ఈ నెల 7 వరకూ స్వీకరిస్తామని ఐసెట్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ పంతుల మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏదైనా డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారితో పాటు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులన్నారు. ఓసీ కేటగిరీ అభ్యర్థులు రూ.650, బీసీ కేటగిరీ అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు రూ.550 పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.1,000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 12 వరకూ, రూ.2,000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 17 వరకూ, రూ.3,000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 22 వరకూ, రూ.5,000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 27 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

శ్రీవారి హుండీ కానుకల లెక్కింపు



కదిరి టౌన్: బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామికి హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ అధికారులు లెక్కించారు. 15 రోజులకు గానూ హుండీల ద్వారా రూ.45,22,374 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాస రెడ్డి తెలిపారు. హుండీల లెక్కింపు బుధవారం కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, ఆలయ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన పవర్

భానుడి భగభగలతో పెరిగిన ఉక్కపోత, గతంలో ఎన్నడూ లేని విధంగా విస్తరించిన పారిశ్రామిక కార్యకలాపాలు, బోరు బావుల్లో తగ్గని నీటి లభ్యత.. తదనుగుణంగా పెరిగిన వ్యవసాయ కార్యకలాపాలు వెరసి ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. మునుపెన్నడూ లేనంత రికార్డు స్థాయికి చేరింది. అయినా, ఎక్కడా చిన్నపాటి అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేస్తుండడం గమనార్హం.



- ఉమ్మడి జిల్లాలో భారీగా విద్యుత్తు వినియోగం
- ఫిబ్రవరి తర్వాత 40 శాతం ఎక్కువగా వాడకం
- అయినా కోతల్లేకుండా కరెంటు సరఫరా
- అధికారుల ముందస్తు కార్యాచరణతో సత్ఫలితాలు
- 2019కి ముందుతో పోలిస్తే భారీగా తగ్గిన ట్రాన్స్‌ఫార్మర్ల నష్టాలు
- జీరో బ్రేక్‌డౌన్‌తో 33 కేవీ, 11కేవీ ఫీడర్లలో విద్యుత్ సరఫరా



ఆత్మకూరు సమీపంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు 20 మిలియన్ యూనిట్లకు పైగా అంటే 2 కోట్ల యూనిట్ల విద్యుత్ ఖర్చవుతున్నట్టు తేలింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 12 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండేది. ఇప్పుడది 20.989 మిలియన్ యూనిట్లకు చేరింది. అయినా ఉదయం పూటే 9 గంటలు వ్యవసాయానికి అందిస్తుండడం గమనార్హం. మరోవైపు గృహావసరాలకు 24 గంటలూ సరఫరా కొనసాగుతోంది.

రోజుకు రూ.167.91 కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్ 2 నాటికి ఉన్న డిమాండ్‌ను బట్టి రోజుకు ప్రభుత్వానికి రూ.167.91 కోట్ల వ్యయమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఒక యూనిట్ విద్యుత్‌ను రూ. 8తో కొనుగోలు చేస్తోంది. ఇందులో గృహావసరాలకు రూ.2తోనూ, కమర్షియల్‌కు స్లాబును బట్టి వసూలు చేస్తుండగా.. వ్యవసాయ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నారు. వ్యవసాయానికి సరఫరా చేస్తున్న కరెంటు కోసం ఏడాదికి రూ.2 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 2019కి ముందు రాష్ట్రంలో వ్యవసాయానికే కాదు గృహావసరాలకు కూడా కోతలతో జనం అల్లాడిపోయేవారు. ఇప్పుడా పరిస్థితి ఏ గ్రామంలోనూ లేదు.

మెరుగుపడిన ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు

గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులు అనేక ఇబ్బందులు పడేవారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఉండేది. అయితే, ప్రభుత్వ చర్యల కారణంగా నేడు అలాంటి పరిస్థితులే లేవు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,76,016 ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయి. గడిచిన మూడేళ్లలో సగటున ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్య శాతం 7.53గా ఉంది. అంతే కాదు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 33కేవీ, 11కేవీ ఫీడర్లు 1,232 ఉండగా, అన్నీ జీరో బ్రేక్‌డౌన్‌తో నడుస్తున్నాయి. అదే 2014–19 కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్య శాతం (డీటీఆర్ ఫెయిల్యూర్) 16 శాతం ఉండేదని అధికారులు చెబుతున్నారు.

గ్రేటర్ రాయలసీమ పూర్వపు జిల్లాల్లో సగటున రోజుకు కరెంటు వినియోగం (మిలియన్ యూనిట్లలో)

జిల్లా	వినియోగం
నెల్లూరు	36.12
చిత్తూరు	27.333
వైఎస్సార్	16.467
అనంతపురం	20.989
కర్నూలు	14.595

పక్కా కార్యాచరణ

ఎస్పీడీసీఎల్ పరిధిలో ఎక్కడా కరెంటు కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించాం. ఒక్క రైతు కూడా కరెంటు లేక పైరు నష్టపోకూడదన్నదే మా సంకల్పం. ఇందుకోసం పక్కా కార్యాచరణతో ముందుకెళుతున్నాం. ఈ రెండు నెలలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులను ఆదేశించాం.

– గౌతమి, కలెక్టర్

కోతలు లేకుండా చూస్తున్నాం

గతంతో పోల్చితే విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. అయినా, ఎక్కడా కోతలు లేకుండా కరెంటు సరఫరా చేస్తున్నాం. బోరుబావులు ఎక్కువగా ఉన్న జిల్లా కాబట్టి వినియోగం కూడా అధికమే. ఈనెలాఖరుకు వరి పంట పూర్తవుతుంది. అనంతరం విద్యుత్తు వినియోగం తగ్గే అవకాశం ఉంది.

– సురేంద్ర, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్

పింఛన్ పంపిణీపై మార్గదర్శకాలు జారీ

- ప్రత్యేక కేటగిరీ వారికి ఇంటి వద్దనే అందజేత
- ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్



అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసిందని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్కరికీ పింఛను అందుతుందని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మార్గదర్శకాలు ఇవే...

- ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ఉండదు.
- అన్ని సచివాలయాల్లో పింఛను పంపిణీ బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభిస్తారు. 4వ, 5వ, 6వ తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు పంపిణీ ఉంటుంది.
- ప్రత్యేక కేటగిరీ పింఛనుదారులకు (దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారు, నడవలేని స్థితిలో ఉన్నవారు) ఇంటి వద్దనే డబ్బు అందజేస్తారు.
- పింఛనుదారులు పింఛను తీసుకునేందుకు వచ్చేప్పుడు ఆధార్‌కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తీసుకు రావాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలకు మూడు కిలోమీటర్లు మించి దూరంలో ఉన్న గ్రామాలు, కుగ్రామాల్లో ఉన్న పింఛనుదారులకు వారివారి గ్రామాలకు సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను పంపిణీ చేస్తారు.
- పింఛను పంపిణీకి సరిపడా బయోమెట్రిక్ పరికరాలను అన్ని సచివాలయాలకు చేరవేత.
- సచివాలయం వద్ద అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిప్పులు కురిపిస్తున్న భానుడు
- తాడిపత్రిలో 43.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

అనంతపురం అగ్రికల్చర్: సూరీడు మండిపోతున్నాడు. ఉమ్మడి జిల్లాలో నిప్పులు కక్కుతున్నాడు. ఈ క్రమంలో ఉక్కపోత, వడగాల్పులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ సీజన్‌లోనే మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. తాడిపత్రి మండలం తేరన్నపల్లి గ్రామంలో 43.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. గుంతకల్లు 43.1 డిగ్రీలు, శింగనమల 42.8 డిగ్రీలు, బొమ్మనహాళ్ 42.3 డిగ్రీలు, శెట్టూరు 42.1 డిగ్రీలు, పెద్దవడుగూరు 42 డిగ్రీలు ఉండగా, పుట్లూరు, యల్లనూరు, యాడికి, అనంతపురం, పామిడి, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, విడపనకల్లు, గార్లదిన్నె, గుత్తి మండలాల్లో 41 డిగ్రీలకు పైగా నమోదైంది. మిగతా మండలాల్లో 39 నుంచి 41 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 22 నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా వేసవితాపం బాగా పెరిగింది. గురువారం తలుపులలో 42.1 డిగ్రీల గరిష్టం నమోదైంది. పరిగి 41.8 డిగ్రీలు, ముదిగుబ్బ 41.7 డిగ్రీలు, కొత్తచెరువు 41.4 డిగ్రీలు, చెన్నేకొత్తపల్లి 41.3 డిగ్రీలు, రామగిరి 41.3 డిగ్రీలు, ఎన్‌పీ కుంట, ధర్మవరం 41.2 డిగ్రీలు ఉండగా.. బత్తలపల్లి, కనగానపల్లి, పెనుకొండ, బుక్కపట్నం, రొద్దం, తనకల్లు, మడకశిరలో 40 డిగ్రీలకు పైగా నమోదైంది. మిగతా మండలాల్లో 38 నుంచి 40 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 20 నుంచి 27 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. గాలిలో తేమశాతం బాగా తగ్గిపోయింది.

ఈ నెలంతా ఇంతే..

ఎండవేడి, వడగాల్పుల తీవ్రత బాగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో జన సంచారం బాగా తగ్గిపోయింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాలు, జంతుజాలం, పశుపక్ష్యాదులపై ప్రభావం పడుతోంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండలు సుర్రుమనిపిస్తుండగా, ఆ తర్వాత రాత్రిళ్లు ఉక్కపోత సెగలు పుట్టిస్తోంది. ఈ నెలంతా ఉష్ణోగ్రతలు గరిష్టంగా కొనసాగే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు.

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయ్.. జాగ్రత్త



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: 'ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి' అని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. వడగాలులపై (హీట్ వేవ్స్) కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఐఈసీ సామగ్రి ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట చేతి పంపుల మరమ్మతు చేయించాలన్నారు. కొత్త బోర్లు వేసిన చోట మోటర్లు బిగించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నగరంతో పాటు పట్టణాల్లో ట్రాఫిక్ ప్రాంతాల్లో గ్రీన్‌షేడ్ నెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పరిశ్రమలు, నిర్మాణ రంగం, ఇటుక బట్టీల్లో పని చేసే కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మునిసిపల్ ఆర్డీ పీవీఎస్ఎన్ మూర్తి, డీపీఓ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యయ పర్యవేక్షణ పక్కాగా చేపట్టాలి

సార్వత్రిక ఎన్నికల్లో వ్యయ పర్యవేక్షణ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్‌పై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యయానికి సంబంధించి పర్యవేక్షణ జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అభ్యర్థులకు డీఈఓ, ఆర్‌ఓలు ఇచ్చే అనుమతుల గురించి అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్లు ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ రోజువారీ ఎన్నికల ఖర్చును ఖాతాల్లో సరిగ్గా నమోదు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించాలన్నారు. పార్లమెంట్, నియోజకవర్గాలకు సంబంధించి వ్యయ పరిశీలన పక్కాగా ఉండాలన్నారు. వ్యయ నమోదు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. సమావేశంలో డీసీఓ అరుణ కుమారి, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ సెల్ అధికారి వెంకటేశ్వర్లు, డీఈఓ ఇంద్రాదేవి, అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం పకడ్బందీగా చేపట్టాలి

- ఒకటికి రెండుసార్లు పరిశీలించి మార్కులు వేయాలి
- పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి
- 'పది' మూల్యాంకన కేంద్రం పరిశీలన



ఆర్జేడీ రాఘవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బాధ్యతాయుతమైనది. విద్యార్థుల జీవితాలతో ముడిపడిన అంశం కాబట్టి జాగ్రత్తగా పేపర్లు దిద్దాలి' అని పాఠశాల రీజినల్ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి సూచించారు. స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని ఆర్జేడీ మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లు పరిశీలించారు. పేపర్లు దిద్దుతున్న ఏఈలతో మాట్లాడారు. వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పేపర్లు దిద్దేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకటికి రెండుసార్లు పరిశీలించి మార్కులు వేయాలన్నారు. మార్కులు, టోటలింగ్‌ను స్పెషల్ అసిస్టెంట్లు పరిశీలించాలన్నారు. జవాబుపత్రాలు దిద్దే సమయంలో సెల్‌ఫోన్లలో మాట్లాడొద్దన్నారు. చల్లని నీరు ఏర్పాటు చేయడం పట్ల ఆర్జేడీ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎంఈఓల రిలీవ్.. హెచ్‌ఎంలకు బాధ్యతలు

అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు(ఏసీఓ)గా నియమించిన మండల విద్యాశాఖ అధికారులను రిలీవ్ చేసి వారి స్థానాల్లో ప్రధానోపాధ్యాయులను తీసుకున్నారు. ఎంఈఓలు విధుల్లో ఉన్నట్లు గుర్తించిన ఆర్జేడీ.. వారికి జగనన్న విద్యా కానుక, నాడు–నేడు పనుల పరిశీలన తదితర ప్రాధాన్యత పనులు ఉన్నాయని తెలియజేశారు. ఈ క్రమంలో వారిని వెంటనే రిలీవ్ చేసి హెచ్‌ఎంలను తీసుకోవాలని ఆదేశించారు. దీంతో నలుగురు ఎంఈఓలను రిలీవ్ చేసి హెచ్‌ఎంలను నియమించారు. ఆర్జేడీ వెంట డీఈఓ వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఉన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

లేపాక్షి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌పై వచ్చిన ఆరోపణలపై గురుకుల పాఠశాలల కర్నూలు ఏజీఎం రాజేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. మార్చి 26వ తేదీన కళాశాల ప్రార్థన సమయంలో ప్రిన్సిపాల్ ప్రసాద్ విద్యార్థుల సమక్షంలోనే తమను దూషించారని అతిథి అధ్యాపకులు, విద్యార్థులు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌కు, కర్నూలు రీజియన్ ఏజీఎంకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఏజీఎం రాజేందర్‌రెడ్డి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, అతిథి అధ్యాపకులతో వేర్వేరుగా సమావేశమై విచారించారు. అంతేకాకుండా ప్రిన్సిపాల్‌పై చేసిన ఆరోపణలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు, అతిథి అధ్యాపకులు ఇచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌కు పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

వైభవం.. పుష్పయాగోత్సవం



కదిరి: పక్షం రోజుల పాటు సాగిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన పుష్పయాగోత్సవంతో ముగిశాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగేందుకు సహకరించిన అష్ట దిక్పాలకులు, పంచ భూతాలు, దేవతా మూర్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని.. వారి వారి లోకాలకు సాగనంపేందుకు నిర్వహించేదే ఈ పుష్పయాగోత్సవమని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు వివరించారు.

24 నుంచి వేసవి సెలవులు

అనంతపురం ఎడ్యుకేషన్: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకూ అన్ని యాజమాన్యాల పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్య కమిషనర్ సురేష్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పదో తరగతి వార్షిక పరీక్షలు పూర్తయి మూల్యాంకనం కూడా జరుగుతోంది. ఇక 1–9 తరగతుల విద్యార్థులకు ఈనెల 6 నుంచి 18 వరకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. 19 నుంచి 21లోపు ఆయా పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. చివరి రోజున ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులకు అందజేయనున్నారు.

పరీక్షల షెడ్యూలు ఇలా...

6వ తేదీ 1–9 తరగతులకు మొదటి లాంగ్వేజ్, 8వ తేదీ 1–5 తరగతులకు ఇంగ్లిష్ పార్ట్–ఎ, 6 నుంచి 9 తరగతులకు సెకండ్ లాంగ్వేజ్, 10వ తేదీ 1–5 తరగతులకు ఇంగ్లిష్ పార్ట్–బీ (టోఫెల్), 6 నుంచి 9 తరగతులకు ఇంగ్లిష్ పార్ట్–ఎ, 12వ తేదీ 1–5 తరగతులకు గణితం, 6–9 తరగతులకు ఇంగ్లిష్ పార్ట్–బీ (టోఫెల్), 13వ తేదీ 3–5 తరగతులకు ఈవీఎస్, 6–9 తరగతులకు గణితం, 15వ తేదీ 3–5 తరగతులకు ఓఎస్ఎస్సీ, 6 నుంచి9 తరగతులకు ఫిజికల్ సైన్స్, 16వ తేదీ 4వ తరగతి విద్యార్థులకు (ఎంపిక చేసిన స్కూళ్లు) స్లాస్–2024 పరీక్ష, 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు బయాలజికల్ సైన్స్, 18న సోషల్ పరీక్ష ఉంటుంది. 1–8 తరగతుల విద్యార్థులకు రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు 9 నుంచి 12.15 గంటల వరకు పరీక్ష సమయం కేటాయించారు.

క్లుప్తంగా

రూ.6.15 లక్షలు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పెద్దవడుగూరు: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.6,15,500 నగదును పెద్దవడుగూరు పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం ఉదయం మిడుతూరు వద్ద ఎస్ఐ శ్రీనివాసులు నేతృత్వంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో అటుగా వచ్చిన ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో రూ.6,15,500 బయటపడింది. పెద్దవడుగూరు మండలం తెలికి గ్రామంలో వేరుశనగ కాయలు కొనుగోలు చేయడానికి వెళుతున్నట్లుగా ఈ సందర్భంగా పోలీసులకు నగదు తరలిస్తున్న వెంకటనాయుడు తెలిపాడు. అయితే నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.2.70 లక్షలు సీజ్

రాయదుర్గం: స్థానిక కణేకల్లు రోడ్డులోని అరబిక్ కళాశాల ఎదురుగా సోమవారం రాత్రి కేంద్ర బలగాలు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.2.70 లక్షల నగదు పట్టుబడింది. ఈ మేరకు రాయదుర్గం సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. గోనబావి కాలనీకి చెందిన దబ్బడి ఉమేష్... ఎలాంటి రసీదులు లేకుండా ద్విచక్ర వాహనంపై నగదు తరలిస్తున్నట్లుగా గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఇన్చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం గ్రామ ఎండీయూ ఆపరేటర్ బండారు కొండయ్య, తాడిపత్రిలోని కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సీనియర్ క్లర్క్ టి.రమేష్‌రెడ్డి ఉన్నారు.

పంటకు చీరకట్టు



మగువకు చీర కట్టు తెచ్చిన అందం గురించి ఎన్నో వర్ణనలు ఉన్నాయి. ఆరు మూరల చీర ఆడపిల్ల కడితే చాలా అందంగా కనపడుతుందనడంలో అతిశయోక్తి లేదు. అంతటి ఘనత కలిగిన మన భారతీయ సంప్రదాయ చీర... పంటను చుట్టుకొని రక్షణ కవచంగా మారింది. ఆరుగాలం రైతులు కష్టపడి పండిస్తున్న టమాట పంటను ఎండ బారి నుంచి రక్షించుకునేందుకు పాత చీరలను రక్షణ కవచాలుగా ఏర్పాటు చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం శివారులో కనిపించిన ఈ దృశ్యం చూపరులను కనువిందు చేస్తోంది. మగువకే కాదు... పంటకూ చీరకట్టు అందం తీసుకువస్తుందని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పోలింగ్ కేంద్రాల్లో 'వెబ్ కాస్ట్'

- చర్యలు చేపట్టిన ఎన్నికల యంత్రాగం
- ఏడు అంశాల పరిగణనతో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు
- జిల్లావ్యాప్తంగా 1,339 కేంద్రాల గుర్తింపు
- అనుమతి కోసం ఈసీకి నివేదిక

జిల్లాలోని మొత్తం పోలింగ్ కేంద్రాలు	2,213
వెబ్‌కాస్టింగ్ అవసరమున్న కేంద్రాలు	1,339

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాగం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ చేసేలా చర్యలు చేపట్టింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 2,213 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1,339 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ అవసరమని ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి నివేదిక సిద్ధం చేసి అనుమతి మంజూరు చేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు.



వెబ్‌కాస్టింగ్‌కు పరిగణనలోకి తీసుకున్న అంశాలు

- క్రిటికల్ (క్లిష్టమైన) పోలింగ్ కేంద్రాలు
- వల్నరబుల్ (సమస్యాత్మక) పోలింగ్ కేంద్రాలు
- 1,200పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు
- ఇతర రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న పోలింగ్ కేంద్రాలు
- ఫిర్యాదులు, వ్యతిరేక కథనాలు వచ్చిన పోలింగ్ కేంద్రాలు
- ఓటరు జాబితా సవరణలో 4 శాతం మించి ఓట్లు చేరిన పోలింగ్ కేంద్రాలు
- రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేసిన పోలింగ్ కేంద్రాలు

నోడల్ అధికారి నియామకం

వెబ్‌కాస్టింగ్ ప్రక్రియ పరవ్యేక్షణకు చేనేత జౌళి శాఖ ఏడీ ఎస్.అప్పాజీని నోడల్ అధికారిగా నియమించారు. ఆయన ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించడం. అధికారులను సమన్వయం చేసుకోవడం, అవసరమైన పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయడం, వెబ్‌కాస్టింగ్ అనుకూలంగా బ్రాడ్‌బ్యాండ్ ఏర్పాటు చేయించడం, అన్ని కేంద్రాల పరిధిలో ఇంటర్నేట్ సౌకర్యం ఉండేలా చూడడం తదితర బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక రూపంలో అందజేస్తుంటారు.

వెబ్‌కాస్టింగ్ అవసరమని గుర్తించిన కేంద్రాలు

నియోజకవర్గం	మొత్తం కేంద్రాలు	వెబ్ కాస్టింగ్ కేంద్రాలు
రాయదుర్గం	296	181
ఉరవకొండ	259	159
గుంతకల్లు	276	137
తాడిపత్రి	272	174
శింగనమల	293	195
అనంతపురం	277	166
కళ్యాణదుర్గం	261	149
రాప్తాడు	279	178
మొత్తం	2,213	1,339



పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ (ఫైల్)

ఓటరుగా నమోదుకు చివరి అవకాశం

అనంతపురం అర్బన్: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదయ్యేందుకు చివరి అవకాశాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ కల్పించింది. ఈ నెల 15వ తేదీలోపు నిర్ణీత దరఖాస్తులను అందజేసిన వారికి ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. 15వ తేదీ తర్వాత అందే దరఖాస్తులను ఎన్నికల తర్వాత పరిశీలిస్తారు.

పరిశీలనకు 10 రోజులు

వాస్తవానికి నామినేషన్ ముగిసే ఆఖరు తేదీ 25వ తేదీ వరకూ ఓటరుగా నమోదుకు అవకాశం ఉంది. అయితే దరఖాస్తుల పరిశీలన, విచారణ ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేసి ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నామినేషన్ల దాఖలుకు చివరి రోజు 25వ తేదీకి ముందు10 రోజుల అంటే 15వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిశీలనకు స్వీకరిస్తున్నారు. అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేసి ప్రస్తుత ఎన్నికల్లో ఓటుహక్కు కల్పిస్తారు.

ఫారం–6 ద్వారా దరఖాస్తు

ఓటరుగా నమోదుకు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్, ఓటరు హెల్ప్‌లైన్ యాప్ ద్వారా 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. అందిన దరఖాస్తుల పరిశీలన 10 రోజుల్లో పూర్తి చేసి అర్హులకు ఓటు హక్కు కల్పిస్తారు.

రేషన్ పంపిణీ వేగవంతం చేయండి : డీఎస్ఓ

శింగనమల: గ్రామాల్లో రేషన్ పంపిణీ వేగవంతం చేయాలని ఎండీయూ ఆపరేటర్లను డీఎస్ఓ శోభారాణి ఆదేశించారు. మంగళవారం శింగనమల మండలం వెస్ట్ నరసాపురం, శింగనమల, నార్పల మండలం ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో ఆమె పర్యటించారు. రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. చౌకధాన్యపు డిపోలకు వచ్చిన బియ్యం, చక్కెర, జొన్నలు, రాగులను సక్రమంగా పంపిణీ చేయాలని ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. ఎక్కడేగాని ఎన్నికల నిబంధనలు అతిక్రమించరాదన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట సీఎస్‌డీటీ రాజశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడ్డ మద్యం బాక్సులు చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: కర్ణాటక నుంచి అక్రమంగా జిల్లాలోకి మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, 90 ఎంఎల్ సామర్థ్యమున్న 864 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రాయదుర్గం సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను ఆయన వెల్లడించారు. మంగళవారం ఉదయం గొల్లపల్లి రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రాయదుర్గానికి చెందిన నాయకుల శ్రీకాంత్, ఏటూరి అజయ్... ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, మద్యం స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తాడిపత్రి అర్బన్: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న తొమ్మిదిమద్యం బాటిళ్లను మంగళవారం అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నందలపాడులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సీఐ మురళీకృష్ణ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కారులో మద్యం తరలిస్తున్న వడ్డే మంజుల పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకకు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి స్వగ్రామం కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లిలో అధిక ధరలకు విక్రయించేందుకు వెళుతున్నానని పోలీసు విచారణలో వెల్లడించినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. కారు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి సస్పెన్షన్

పెనుకొండ: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రజారవాణా విభాగం (పీటీడీ) ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ 2గా పని చేస్తున్న రామాంజినేయులుపై సస్పెన్షన్ వేటు పడింది. 4 ,5 రోజులుగా తన విధులకు ఎగనామం పెడుతూ అనంతపురంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకట ప్రసాద్ తరఫున ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటూ వస్తున్నారు. దీంతో పీటీడీ ఉద్యోగులు కొందరు ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో విచారణ అనంతరం వాస్తవాలను నిర్ధారించుకుని రామాంజినేయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అరటి తోట దగ్ధం

మడకశిర రూరల్: మండలంలోని బుళ్లసముద్రం సమీపంలో రైతు రంగనాథ్ సాగు చేసిన అరటి తోటకు మంగళవారం మంటలు వ్యాపించి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు ఎగిసి పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పెద్ద శబ్దంతో పేలింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానించిన కండక్టర్‌ను కట్ చేశారు. మూడు ఎకరాల్లో సాగు చేసిన అరటి పంట కోత దశలో ఉందని, దిగుబడితో పాటు డ్రిప్ పరికరాలు దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపాడు. కాగా, ప్రమాదంలో రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే వాల్మీకులకు గుర్తింపు

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్

గుంతకల్లు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఏర్పాటైన తర్వాత వాల్మీకులకు అన్ని విధాలుగా గుర్తింపు దక్కిందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఈ రోజు వాల్మీకులు ఉన్నత స్థానంలో ఉన్నారంటే దానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే కారణమన్నారు. గుమ్మనూరు జయరామ్ గతంలో మంత్రిగా ఉండి అభివృద్ధి చేయని కారణంగా ఆయనను పార్టీ నుంచి అధిష్టానం తొలగించిందన్నారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన గుమ్మనూరు అందజేసిన ప్యాకేజీకి ఆశపడి గుంతకల్లు నుంచి పోటీ చేసే అవకాశం కల్పించిన చంద్రబాబు... నేడు వాల్మీకులకు తానేదో మంచి చేసినట్లుగా గొప్పలకు పోతుండడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీగా పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరక్క పోవడంతో పొరుగు జిల్లా నుంచి దిగుమతి చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా... వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరని, రానున్న రోజులు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలు స్వీకరించడం ఖాయమని అన్నారు.

కణేకల్లు క్రాస్‌లో చిరుత సంచారం

కణేకల్లు: మండలంలోని కణేకల్లు క్రాస్ వద్ద చిరుత సంచారం కలకలం రేపుతోంది. నాలుగైదు రోజులుగా ఆ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లుగా సోమవారం రాత్రి సీసీ పుటేజ్‌లోని దృశ్యాలు రుజువు చేశాయి. కణేకల్లు క్రాస్, కళ్యాణదుర్గం రోడ్డు పరిసర ప్రాంతాల్లోని పండ్ల తోటల నుంచి చిరుత బయటకు వస్తున్నట్లుగా స్థానికులు తెలిపారు. రైతు ప్రదీప్‌రెడ్డి దానిమ్మ తోటలో సోమవారం రాత్రి చిరుత సంచరించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కణేకల్లు క్రాస్, ఆలూరు పరిసర ప్రాంతాల్లో నివాశముంటున్న ప్రజలతో పాటు రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే పండ్ల తోటల్లోకి ఒంటరిగా వెళ్లొద్దంటూ రైతులకు ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



నల్లయ్య (ఫైల్)

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోటకు చెందిన రైతు నల్లయ్య (58) ఆత్మహత్య చేసుకున్నాడు. గత ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు గాలింపు చేపట్టారు. గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో నల్లయ్య మృతదేహాన్ని గుర్తించారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కరివేప పంట దిగుబడి సక్రమంగా రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్య అనంతమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్ మల్లెల శివప్రసాద్

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను ఆ విభాగం జాయింట్ కమిషనర్ మల్లెల శివప్రసాద్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలీలతో మాట్లాడుతూ... రూ.300 చొప్పున దినసరి కూలి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎండలు అధికంగా ఉన్న కారణంగా తెల్లవారుజాము 5 గంటలకే పనుల్లోకి వెళ్లి 11 గంటల్లోపు ఇంటికి చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

యల్లనూరు: బాలికను వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాలను ఎస్ఐ గిరిబాబు వెల్లడించారు. యల్లనూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన శివశంకరరెడ్డి... అదే గ్రామానికి చెందిన ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి బాలిక తీసుకెళ్లడంతో మంగళవారం వారు పోలీసులను ఆశ్రయించారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... విచారణ అనంతరం శివశంకరరెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశాలకు డిమాండ్

- జిల్లాలోని 15 మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాలకు 3,268 దరఖాస్తులు
- రాయదుర్గం మోడల్ స్కూల్‌కు అత్యధికంగా 452 దరఖాస్తులు



రాయదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్

రాయదుర్గంటౌన్: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్)లో 6వ తరగతి ప్రవేశాలకు భారీ డిమాండ్ నెలకొంది. జిల్లాలోని 15 ఏపీ మోడల్ స్కూళ్లు ఉండగా మంగళవారం నాటికి 3,268 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించారు. ఈ నెల 6వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు ఉండడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఒక్కో మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో వంద సీట్లకు ప్రవేశాలకు ఈ నెల 21న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో రాయదుర్గం మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు అత్యధికంగా 452 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా రెండో స్థానంలో గుత్తి మోడల్ స్కూల్‌లో 441 మంది, మూడో స్థానంలో పామిడి మోడల్ స్కూల్‌లో 335 మంది, నాల్గో స్థానంలో గార్లదిన్నె మోడల్ స్కూల్‌లో 289 మంది, తాడిపత్రి మోడల్ స్కూల్‌లో 273 మంది, రాప్తాడులో 247, కళ్యాణదుర్గంలో 234 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యల్పంగా యల్లనూరు మోడల్ స్కూల్‌లో 82 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఎంసీసీ ఉల్లంఘనులపై చర్యలు తప్పవు

- విలేకర్ల సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్



సిబ్బందికి సూచనలిస్తున్న కేతన్‌గార్గ్

ఉరవకొండ: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ – ఎంసీసీ) అమలులోకి వచ్చిందని, ఈ క్రమంలో ఎంసీసీ ఉల్లంఘనులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఉరవకొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. మంగళవారం ఉరవకొండలోని కమాండ్ కంట్రోల్ రూంను ఆయన తనిఖీ చేశారు. పలు అంశాలపై అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ పబ్లిక్ ప్రాపర్టీస్‌కు సంబంధించి 596 కేసులు, ప్రైవేట్ ప్రాపర్టీస్‌కు సంబంధించి 399 నమోదు చేసినట్లుగా తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘనకు సంబంధించి అధికారులపై అందిన ఫిర్యాదులను విచారించి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రేషన్ షాపు డీలర్లు, ఇతర శాఖలకు సంబంధించిన సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనుమతులు లేనిదే ఏ కార్యక్రమాన్ని రాజకీయ పార్టీల నేతలు చేపట్టరాదన్నారు. అనుమతులు లేని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి సర్వే పూర్తి అయిందన్నారు.

నగదు చోరీ

గోరంట్ల: స్కూటర్ డిక్కీలో ఉంచిన నగదును దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్లలోని వనప్పనగర్‌లో నివాసముంటున్న మిలటరీ ఉద్యోగి మదన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం తన భార్య తహేరభానుతో కలసి స్థానిక ఎస్‌బీఐ శాఖకు చేరుకుని ఆమె ఖాతాలోని రూ.5.9 లక్షలను డ్రా చేశారు. ఆ మొత్తాన్ని స్కూటర్ డిక్కీలో ఉంచి ఇంటి వద్ద భార్యను వదిలి పిల్లలను పిలుచుకుని వచ్చేందుకు స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల వద్దకు చేరుకున్నాడు. పాఠశాల మైదానంలో స్కూటర్ నిలిపి తరగతి వద్దకెళ్లి పిల్లలను పిలుచుకు వచ్చేలోపు దుండగులు డిక్కీని బద్దలుగొట్టి నగదు అపహరించుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఉపాధ్యాయుడిపై వేటు

చిలమత్తూరు: మండలంలోని వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రంగారెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈఓ మీనాక్షి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగరాజు మంగళవారం తెలిపారు. ఆదివారం చేనేపల్లిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తరఫున ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడాన్ని కలెక్టర్ అరుణ్‌కుమార్ తీవ్రంగా పరిగణించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రంగారెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలివ్వడంతో సస్పెండ్ చేస్తూ డీఈఓ మీనాక్షి ఉత్తర్వులు జారీ చేశారు.

సిరా గుర్తు.. ప్రగతికి మెట్టు



హిందూపురం టౌన్: 'నీ వేలిపై సిరా చుక్క దేశ ప్రగతికి వేగు చుక్క' అంటూ ఓటు విలువను ఎన్నికల సంఘం తెలియజేస్తోంది. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి సాధారణంగా ఎడమ చేతి చూపుడు వేలిపై సిరా చుక్క పెడతారు. చేతి వేళ్లులేని దివ్యాంగులకు కాలి వేళ్లకు సిరా చుక్క పెడతారు. ఇది ఓటేశామని గుర్తు మాత్రమే కాదు. దొంగ ఓట్లను నిరోధించే ఆయుధం కూడా. ముఖ్యంగా చర్మంపై పూసిన ఈ సిరాను త్వరగా తొలగించడం దాదాపు అసాధ్యం. వేలుపై పూసిన ఈ సిరా 15 నుంచి 30 సెకన్లలో పొడిబారుతుంది. ఎన్నికలలో వాడే ఇండెలిబుల్ ఇంక్ వేలిపై పడితే 72 గంటల నుంచి 96 గంటలు ఉంటుంది. ఈ సిరాను 1962 నుంచి కర్నాటకలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తోంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆ కంపెనీ నుంచే సిరా సరఫరా అవుతుంది. సిరాలో 14 లేదా 18 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండడంతో ఎక్కువ కాలం చెరిగిపోకుండా ఉంటుంది.

చంద్రబాబుకు ఉసురు తగులుతుంది

- టీడీపీ అధినేతపై పింఛన్‌దారుల మండిపాటు
- సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీపై అసంతృప్తి



ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌దారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేసేవారు. కాని ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. దీంతో ఎన్నికల కమిషన్ వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకూడదంటూ ఆదేశాలిచ్చింది. ఎన్నికల కమిషన్ నిర్ణయంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 5,956 మందికి పింఛన్ సొమ్ము అందజేయాల్సి ఉంది.

తలుచుకుంటేనే భయమేస్తోంది..



నెలనెలా ఇంటి వద్దే పింఛన్ డబ్బు తీసుకునేవాళ్లం. ఇప్పుడు చంద్రబాబు మనుషులు ఎన్నికల ఆఫీసర్లకు చెప్పి పింఛన్లు వలంటీర్లు ఇవ్వకూడదని చెప్పడం బాధాకరం. చంద్రబాబు చేసిన నిర్వాంతో నాలాంటి వాళ్లు ఎంతోమంది ఇబ్బంది పడతారు. అసలే ఎండాకాలం సచివాలయం దగ్గరకు వెళ్లాలంటే ఎలా. తలుచుకుంటనే భయమేస్తోంది.

–రామయ్య, లక్ష్మీదేవి, ముట్టాల


చంద్రబాబు బుద్ధి మంచిది కాదు



గత ఐదేళ్లుగా జగన్ పుణ్యామా అంటూ ఉదయాన్నే తలుపులు తట్టి వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారు. కాని ప్రస్తుతం సచివాలయాల వద్దకు వెళ్లి తీసుకోండి అని అంటున్నారు. జగన్‌బాబు మంచి చేయాలన్న ఉద్దేశం ఉంటే చంద్రబాబు ఇలాంటి పని ఎలా చేస్తాడు. చంద్రబాబు బుద్ధి మంచిదికాదు.మా ఉసురు ఆయనకు తప్పక తగులుతుంది.

–యర్రమ్మ, ముట్టాల

చాలా ఇబ్బంది



ఇంటి నుంచి గ్రామ సచివాలయం వద్దకు మూడు కి.మీ దూరం ఉంది. ప్రతి నెలా వలంటీర్ ఇంటి వద్దకు పింఛన్ సొమ్ము అందించేవాడు. ఇప్పుడు చంద్రబాబు తన వారితో ఫిర్యాదు చేసిన కారణంగా సచివాలయం వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వయసులో అంత దూరం వెళ్లాలంటే చాలా ఇబ్బందే.

–నారాయణరెడ్డి, ఆత్మకూరు

క్లుప్తంగా

పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫా అందిస్తున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం కల్చరల్: నగరంలోని గఫూర్ కాలనీలో మంగళవారం దాదాపు 300 కుటుంబాలకు డాక్టర్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందించారు. మేయర్ వసీం, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి పేద ముస్లిం కుటుంబం పండుగను ఆనందంగా జరుపుకోవాలన్న మంచి ఉద్దేశంతో డాక్టర్ గఫూర్ ఏటా రంజాన్ తోఫా అందించడం అభినందనీయమన్నారు. రంజాన్ మాసంలో చేసే ప్రతి పుణ్య కార్యక్రమానికి రెట్టింపు ఫలితం ఉంటుందన్నారు. డాక్టర్ అర్షద్ అయూబ్, డాక్టర్ మహ్మద్ ఆలీ, మూసరజా, సద్దాం హుస్సేన్, జిలాన్, షబ్బీర్ పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ స్కూల్ వార్షికోత్సవం



విద్యార్థుల నృత్య ప్రదర్శన

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని నారాయణ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని టీటీడీ కళ్యాణమంటపంలో ఏర్పాటు చేసిన వేడుకలకు నారాయణ పాఠశాలల ఏజీఎం రమేష్‌బాబు హాజరయ్యారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవరుచుకోవాలని సూచించారు. సీఓ కోఆర్డినేటర్ ప్రేమసాగర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు మారుతున్న కాలనుగుణంగా సాంకేతిక విద్య పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రీజనల్ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు హరితారెడ్డి, రెహానా సుల్తానా, ప్రిన్సిపాల్ రాధానాయుడు పాల్గొన్నారు.

యోగీశ్వరుల గీతా ప్రచారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైతసిద్ధాంత ప్రచారకులు

అనంతపురం కల్చరల్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల జన్మదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం నగరంలోని మంగళవారి కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ అనంత ఆధ్యాత్మికలోకంలో ప్రబోధానంద మహర్షి వినూత్న తరహాలో గీతాప్రచారానికి విలక్షణత తెచ్చారని, సంపూర్ణ గురువుగా ఖ్యాతికెక్కిన ప్రబోధానంద ఎంతో మందిని ధన్యులను చేశారన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతాలను రానున్న రోజుల్లో మరింత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, విజయక్క, ప్రసన్న, నాగేశ్వరి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం



ముట్టాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: గ్రామాల్లో అభివృద్ధి చెందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను కోరారు. మంగళవారం ముట్టాల, పాపంపల్లిలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రిగా చేసిన సునీత ఏనాడు నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆలోచించలేదన్నారు. నీరు – చెట్టు పేరుతో దోచుకోవడం , దాచుకోవడం తప్ప అభివృద్ధి అంటూ ఏమి చేయలేదన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులను అడ్డం పెట్టుకొని ప్రజలను నిలువునా దోచేశారన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రాప్తాడు అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, మళ్లీ రాప్తాడులో ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. మండల కన్వీనర్ లక్ష్మీనరిసింహులు, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, సర్పంచ్‌లు తిరుపాలమ్మ, నాగరత్నమ్మ, ఎర్రిస్వామి, వైస్ ఎంపీపీ విజయ్, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉప సర్పంచ్ మంజుల, నాయకులు వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, మాదన్న, లక్ష్మీరెడ్డి, అక్కులప్ప, గోవింద్, ముత్యాలరెడ్డి, ఓబయ్య, చెన్నారెడ్డి, జయరెడ్డి, ముత్యాలరెడ్డి, పవన్, పోతన్న, వెంకటేష్,మహేష్, హరి, దామోదర్‌రెడ్డి, వెంకట్రాముడు, గడార వెంకటేష్, మల్లేష్, లక్ష్మిరెడ్డి, బజార్ శీన, తైదుల శివారెడ్డి, మహేంద్ర,శ్రీరామ్, గంగాధర్ పాల్గొన్నారు.

హజర మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని ఏ హజర మసీదులో మంగళవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందు కార్యకమం నిర్వహించారు. కార్పొరేటర్ రహంతుల్లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి,మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ విజయభాస్కరరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ హాజరయ్యారు. ఉపవాసదీక్షలను స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్న అందరినీ ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా మతపెద్దలు రంజాన్ పర్వదినాల విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ముస్లింలకు స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, కార్పొరేటర్ ఇసాక్, జావీద్, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 34వ డివిజన్‌లోని మారుతీనగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలు తీసురొచ్చారన్నారు. ప్రతి పేదవాడి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు నవరత్నాలను అమలు చేశారని గుర్తు చేశారు. గతంలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించామన్నారు.

ప్రతి డివిజన్‌లోనూ అభివృద్ధి

ప్రాధాన్యత క్రమంలో ప్రతి డివిజన్‌లోనూ అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే అనంత పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నగరంలో అభివృద్ధి డివైడర్లకే పరిమితమైందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోవిడ్‌తో రెండేళ్లు గడిచిపోయినా.. రూ.వెయ్యి కోట్లతో నియోజకవర్గం రూపురేఖలను మార్చేశామన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, గుత్తి రోడ్డు, రుద్రంపేట, కలెక్టరేట్, రాజీవ్‌కాలనీ బ్రిడ్జి తదితర నిర్మాణ పనులను పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి ప్రజలే సాక్ష్యమన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదిస్తే..రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి అందిస్తామన్నారు. ముందుచూపుతో ఆలోచించి..మీ భవిష్యత్తు అయిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, కార్పొరేటర్లు మునగల రమాదేవి, సాకే చంద్ర, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, దుర్గాదేవి, లీలావతి, కొండ్రెడ్డి రాధా, బాలాంజినేయులు, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతాసోమశేఖర్ రెడ్డి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్ గౌడ్, తనీష, వనారస బలరాం, మిద్దె నగేష్, చెన్నారెడ్డి, రామకృష్ణ, కేశవరెడ్డి, నిహార్ రెడ్డి, గుజ్జల శివయ్య, జానీ, దాదాఖలందర్, జావెద్, భారతి, అనిత, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటోలకు చెత్త అందించండి



ప్రజారోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: క్లాప్ ఆటోలకు చెత్తనందించాలని నగర ప్రజలకు కమిషనర్ మేఘ స్వరూప్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని 1 నుంచి 6వ రోడ్డు, ఎంజీ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, కమలానగర్, రాంనగర్ తదితర ప్రాంతాల్లో చెత్త నిర్వహణను కమిషనర్ పరిశీలించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయకూడదన్నారు. చెత్త తరలించే వాహనాలు ప్రతి ఇంటి వద్దకూ వస్తాయని, సిబ్బందికి చెత్తనందించాలన్నారు. మురుగుకాలువల్లో పూడికతీత పనులు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, తదితరులున్నారు.

పన్ను వసూలులో వంద శాతం లక్ష్య సాధన



మాట్లాడుతున్న మార్కెట్‌యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి

రాప్తాడు: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దేశిత పన్ను వసూలు లక్ష్యం వంద శాతం పూర్తి చేసినట్లు రాప్తాడు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్ యార్డ్ పరిధిలో వివిధ రకాల పన్ను వసూలు రూ.50 లక్షలు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అయితే లక్ష్యానికి మించి అదనంగా 14 వేలు వసూలు చేశామని తెలిపారు. ఇందుకు సహకరించిన రైతులు, వ్యాపారులు, మార్కెట్ కమిటీ సెక్రటరీ, అధికారులు, పాలక వర్గం సభ్యులు ఇతర సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వచ్చే సంవత్సరంలో మరింత ఎక్కువగా మార్కెట్ ఫీజు, సెస్ వసూలు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రోత్సాహంతో మార్కెట్ యార్డ్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో మళ్లీ జగనన్న పాలనే



బుక్కచెర్లలో రోడ్ షోలో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: ఎన్నికలు వచ్చాయని టీడీపీ, జనసేన కలిసి ఎటువంటి కుట్రలకు పాల్పడతారోనని అవ్వాతాలు, పేద, సామాన్య వర్గాలు భయాందోళన చెందొద్దని, మీ అందరి ఆశీర్వాదంతో రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే రానుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, ఎం.బండమీదపపల్లి గ్రామాల్లో ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఎమ్మెల్యేకు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ముందుగా బుక్కచెర్లలో ఎమ్మెల్యే నల్లాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో 17 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. 2 వేల మందికి ఉచిత బోర్లు వేశామన్నారు. అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి 10 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించామన్నారు. బంగారు గనులును తెరిపించామని ఎమ్మెల్యే తెలిపారు. గార్మెంట్స్ పరిశ్రమలు కూడా తీసుకొస్తామని, సోలార్ పార్క్ ద్వారా 10 వేల మందికి ఉపాధి కల్పించబోతున్నామని ప్రకటించారు. బుక్కచెర్ల, జి.కొత్తపల్లిలో రూ.80 లక్షలతో రెండు గోడౌన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. గాండ్లపర్తి, వరిమడుగు, భోగినేపల్లి, జి.కొత్తపల్లి, పాలచెర్ల గ్రామాలకు డిస్ట్రిబ్యూటర్ల ద్వారా పేరూరు డ్యాం నుంచి నీళ్లు తెచ్చామన్నారు. పేరురూ డ్యాంకు మూడేళ్లుగా నీటిని తెచ్చుకున్నామని, హంద్రీ నీవా కాలువ నుండి భోగినేపల్లి ఆనకట్టకు సొంత ఖర్చులతో కాలువ తవ్వి నీటిని తీసుకొచ్చామన్నారు.

21వేల ఎకరాలకు సాగునీరు

ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో రూ.150 కోట్లతో రిజర్వాయర్‌ను మంజూరు చేయించుకున్నామని, రూ.150 కోట్లతో భూ సేకరణ పనులు మొదలు పెట్టామని ఎమ్మెల్యే తెలిపారు. తోపుదుర్తికి రిజర్వాయర్ వస్తే తోపుదుర్తిలో 1000 ఎకరాలు, గాండ్లపర్తి, వరిమడుగు, భోగినేపల్లి, బుక్కచెర్ల, ఎం.బండమీదపల్లి, మరూరు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు, గొందిరెడ్డి, యర్రగుంట, జి.కొత్తపల్లి, పాలచెర్ల, కాట్నేకాలువ గ్రామాల్లోని 20 వేల ఎకరాలకు నీళ్లను పారిస్తామన్నారు. జగనన్న వచ్చిన తర్వాతే నాలుగేళ్లుగా గాండ్లపర్తి, జికొత్తపల్లి చెక్ డ్యాం రోడ్డుపై నీళ్లు నిత్యం పారించామన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా చంద్రబాబు నిమ్మగడ్డ రమేష్ కుమార్ ద్వారా ఎలక్షన్ కమిషన్ ఫిర్యాదు చేసి అడ్డుపడుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో తనను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారెడ్డి, సర్పంచులు చంద్రకళ, ఆదినారాయణమ్మ, ఉమాదేవి, ఎంపీటీసీలు రుక్మిణమ్మ, రాముడు, వైఎస్సార్ సీపీ నాయకులు బెంచి ఆదిరెడ్డి, ఎద్దుల ప్రకాష్‌రెడ్డి, బెంచి ఆదినారాయణరెడ్డి, డొక్కా రామచంద్ర, గవ్వల నలప్ప, తిరుపాల్‌రెడ్డి, పక్కిరప్ప, సుబ్బారెడి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎం.చెర్లోపల్లికి చెందిన వడ్డే భాస్కర్‌తో పాటు మరో 10 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం జి.కొత్తపల్లి గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాచానపల్లి సచివాలయ వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన వలంటీర్లు



తగరకుంటలో అధికారులకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

రాప్తాడురూరల్: టీడీపీ కక్షగట్టి తమను విధుల నుంచి దూరంగా ఉండేలా చేసిందని నిరసిస్తూ రాచానపల్లి సచివాలయ వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యదర్శిని కలిసి రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మౌనిక, పుష్పావతి, ఫయాజ్, నిరంజన్, యశ్వంత్, మహేష్, ఇంద్రజ, సుభాషిణి, జ్యోత్స్న, అరుణ, హేమలత, యశ్వంత్, నూర్జహాన్, రాజేశ్వరి, వరలక్ష్మీ తదితరులు మాట్లాడుతూ రాజకీయా పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తున్న తమను ఇబ్బందులు పెట్టించే ప్రయత్నాలు చేయడం బాధాకరమన్నారు. నిమ్మగడ్డ రమేష్ అనే వ్యక్తి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు ఇవ్వడంతోనే పింఛన్ల పంపిణీ నుంచి తమను తప్పించారన్నారు. ఇన్నేళ్లు పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా ప్రజాసేవ చేశామన్నారు. అలాంటిది ఈరోజు ఒక పార్టీకి ముడిపెడుతూ ఫిర్యాదులు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కారణంగానే తాము రాజీనామాలు చేసినట్లు వెల్లడించారు.

ఆత్మకూరు: మండలానికి చెందిన పలువురు మంగళవారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఈమేరకు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ దశరథరామయ్య అందజేశారు. సిద్ధరాంపురం, ముట్టాల, ఆత్మకూరుకు చెందిన ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

కనగానపల్లి: ప్రజా సేవకు ఆటంకం కల్గించేలా ప్రతిపక్ష పార్టీ నాయకులు చేసిన కుట్రలకు నిరసనగా వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. తగరకుంట, ముత్తువకుంట గ్రామ సచివాలయ పరిధిలోని 23 మంది గ్రామ వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను స్థానిక పంచాయతీ కార్యదర్శులకు అందజేసి గ్రామ సచివాలయాల వద్ద తమ నిరసనను తెలియజేశారు. ముత్తువకుంట్లకు చెందిన వలంటీర్లు బండి మహేంద్ర, మురళీక్రిష్ణా, సతీష్, దివ్యభారతి, సువర్ణ, మల్లికార్జున, తగరకుంట వలంటీర్లు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో..

ప్రతిపక్ష పార్టీల చర్యలకు నిరసనగా చెన్నేకొత్తపల్లి మండలంలో వలంటీర్లు రాజీనామాలు చేశారు. మంగళవారం చెన్నేకొత్తపల్లికి చెందిన వలంటీర్లు వెంకటరామిరెడ్డి, మంజునాథ్‌లు స్థానిక పంచాయతీ కార్యదర్శికి తమ రాజీనామా పత్రాలు అందజేశారు.

కందుకూరులో జోరుగా ప్రచారం

రాప్తాడురూరల్: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం అనంతపురం రూరల్ మండలం కందుకూరులో జోరుగా ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి తెలియజేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గంలో ఎక్కడా గొడవలు లేకుండా చేశారని, ఫ్యాక్షన్ కు చెక్ పెట్టించారని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీపీ వరలక్ష్మి, జిల్లా ప్రధానకార్యదర్శి తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మహిళా విభాగం అంజనాదేవి, సర్పంచులు ప్రశాంత్ కుమార్, కృష్ణారెడ్డి, గురు ప్రసాద్, గాండ్ల కృష్ణయ్య,వైస్ సర్పంచ్ కేపీ ఓబులేశు, ఎంపీటీసీ సభ్యురాలు రాగే రేవతి పెద్దప్ప, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, సోమశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డిచ కాటమగారి కృష్ణారెడ్డి, రామలింగారెడ్డి సచివాలయ కన్వీనర్ రాఘవరెడ్డి గోవర్ధన్ రెడ్డి, బూత్ కన్వీనర్లు వెంకటరామిరెడ్డి, కప్పల రాము, బాలకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి

రాప్తాడు: నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు, పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వసంత బాబు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంత చాలా కీలకమన్నారు. 17సీ, పీఓ డైరీ, పీఓ రిపోర్టులతో పాటు ఈవీఎంఎం కనెక్షన్‌పై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. మే 13న పోలింగ్ ఉంటుందని, దాని ముందు రోజునే పోలింగ్ మెటీరియల్ మొత్తం వచ్చిందో లేదో సరి చూసుకున్న తరువాతే కేంద్రానికి వెళ్లాలన్నారు. ఏ సమస్య ఉత్పన్నమైనా 50 నిమిషాల్లో మీ పరిధిలో, 100 నిమిషాల్లో తన పరిధిలో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకల్లా మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎలాంటి ద్రవ పదార్థాలు, మారణాయుధాలు, మీడియాకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో సెక్టార్స్ అధికారులు, పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.

నేడు 35వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్ సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 35వ డివిజన్‌లో బుధవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాంనగర్ 80 ఫీట్ రోడ్డు నుంచి కార్యక్రమం మొదలవుతుందని ప్రజాప్రతినిధులు, శ్రేణులు పాల్గొనాలని కోరారు.

పేద బ్రాహ్మణుడికి చేయూత

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడోరోడ్డులో నివాసముంటున్న మధుసూదనరావు అనే పేద బ్రాహ్మణుడు ఇటీవల 3వ రోడ్డులోని బాబా మందిరంలో ప్రసాదం తయారు చేస్తూ ప్రమాదవశాత్తు వేడి ప్రసాదం పడడంతో తీవ్రంగా గాయాలపాలై మంచానికి పరిమితమయ్యాడు. జీవనాధారం కష్టం కావడంతో సాయిట్రస్టు వారిని సంప్రదిస్తే వెంటనే స్పందించిన ట్రస్టు ప్రతినిధులు మంగళవారం రూ.25 వేలు విలువ చేసే నిత్యావసరాలు, రూ.5 వేలు నగదునందించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రామకృష్ణ, కరణం కళ్యాణ్, అకిల్, బాలాజీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు అయ్యవారిపల్లి, 4 గంటలకు ప్రసన్నాయపల్లి, 5 గంటలకు చిన్మయనగర్, 6 గంటలకు కళాకారుల కాలనీలో ఎన్నికల ప్రచారం ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని వారు కోరారు.